ఉత్తరం
TG TEL/25/A1234
www.kakatiyanews.com
# కాకతీయ
శుక్రవారం 09 అక్టోబర్ 2026 | సంపుటి - 02 సంచిక - 50 | పేజీలు - 4 వెల - 5

## నానా పటేకర్ కన్నుమూత!

దిగ్గజ నటుడి మృతితో భారతీయ చిత్ర పరిశ్రమలో విషాదం
సహజ నటనతో కోట్లాది మంది అభిమానులను సంపాదించిన కళాకారుడు
భావోద్వేగ నివాళి అర్పించిన ఐకాన్ స్టార్ అల్లు అర్జున్

2లో..





ట్రూ అప్ పేరుతో వినియోగదారులపై అదనపు వసూళ్లు
నవంబర్ నుంచి యూనిట్‌కు 30 పైసలు
డిసెంబర్ నుంచి 50 పైసలకు పెంపు
దక్షిణ తెలంగాణలో 29 నెలలు.. ఉత్తర తెలంగాణలో 26 నెలలు
200 యూనిట్లు దాటితే మధ్యతరగతిపై ప్రభావం
53 లక్షల గృహజ్యోతి కుటుంబాలకు మినహాయింపు

# రూ.5,420 కోట్ల కరెంట్ భారం!

కాకతీయ, తెలంగాణ బ్యూరో : డిస్కంలకు విద్యుత్ సరఫరా సమయంలో ఏర్పడిన రూ.5,420 కోట్ల నష్టాన్ని పూడ్చేందుకు ట్రూ అప్ ఛార్జీల రూపంలో వినియోగదారులపై అదనపు భారం పడనుంది. నవంబర్ నుంచి ప్రతి యూనిట్‌కు 30 పైసలు, డిసెంబర్ నుంచి 50 పైసల చొప్పున అదనంగా వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో 200 యూనిట్లకు మించి విద్యుత్ వినియోగించే కుటుంబాల నెలవారీ కరెంటు బిల్లులు పెరగనున్నాయి. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు వినియోగిస్తున్న సుమారు 53 లక్షల కుటుంబాలకు మాత్రం ఈ ట్రూ అప్ ఛార్జీల నుంచి మినహాయింపు లభించింది. 2023–24, 2024–25 ఆర్థిక సంవత్సరాల్లో విద్యుత్ సరఫరాకు సంబంధించి డిస్కంలకు రూ.5,420 కోట్ల నష్టం వాటిల్లిందని ప్రభుత్వం పేర్కొంటోంది. ఈ నష్టాన్ని భర్తీ చేసేందుకు వినియోగదారుల నుంచి ట్రూ అప్ ఛార్జీల రూపంలో వసూలు చేయనున్నారు. గతంలో కుదిరిన విద్యుత్ సరఫరా ఒప్పందాలు, ఉచిత విద్యుత్ వంటి పథకాల వల్ల డిస్కంలపై పడిన ఆర్థిక భారాన్ని సర్దుబాటు చేసే ప్రక్రియలో భాగంగానే ఈ వసూళ్లు చేపడుతున్నట్లు వివరించారు.

దక్షిణ తెలంగాణకు 29 నెలలు

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని వినియోగదారులకు ఈ అదనపు ఛార్జీలు 29 నెలల పాటు వర్తించనున్నాయి. నవంబర్‌లో యూనిట్‌కు 30 పైసల చొప్పున ప్రారంభమయ్యే అదనపు వసూలు

........(తరువాయి 2లో)



## జీరో దందాపై ఆరా..!

ఏనుమాముల మార్కెట్లో మళ్లీ తనిఖీలు
తక్ పట్టీలు.. కాంటా చిట్టీలపైనా పరిశీలన
రికార్డులు.. గేట్ ఎంట్రీల మధ్య తేడాలపై దృష్టి
ఆగస్టులో రెండు బృందాల తనిఖీలు
మళ్లీ రంగంలోకి అడిషనల్ కమిషనర్ బృందం
గత తనిఖీల నివేదికలు ఏమయ్యాయి?

కాకతీయ, వరంగల్ ప్రతినిధి : ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌పై అధికారుల నిఘా మళ్లీ పెరిగింది. ఆగస్టులో రెండు వేర్వేరు బృందాలు తనిఖీలు నిర్వహించిన తర్వాత.. తాజాగా మార్కెటింగ్ శాఖ అడిషనల్ కమిషనర్ పర్యవేక్షణలో మరో బృందం రంగంలోకి దిగింది. జీరో దందా, తక్ పట్టీలు, కాంటా చిట్టీలు, ఇన్‌వార్డ్, అవుట్‌వార్డ్, గేట్ ఎంట్రీ రికార్డులపై లోతుగా పరిశీలన సాగుతోంది. గత తనిఖీల నివేదికలు ........(తరువాయి 2లో)

## సింగరేణిని కుంభకోణాల గనిగా మార్చారు

లాభాలు తగ్గినా కార్మికుల కష్టానికి కొరతలేదు
రూ.6,394 కోట్ల నుంచి రూ.1,800 కోట్ల లోపునకేనా?
బొగ్గు ఉత్పత్తిలో 12 మిలియన్ టన్నుల తగ్గుదల
కార్మికుల వాటా, బకాయిలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం
జీవో 76 అమలు చేయాలి..
డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వాలి
14న రామగుండంలో సింగరేణి కార్మిక గర్జన
మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు

కాకతీయ,తెలంగాణ బ్యూరో : సింగరేణిని కుంభకోణాల గనిగా మార్చారని, అవినీతి, బంధుప్రీతి, ప్రభుత్వ నిర్ణయాల వల్ల సంస్థ లాభాలు, బొగ్గు ఉత్పత్తి తగ్గుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. కార్మికులు కష్టపడి పనిచేస్తున్నా పాలకుల నిర్ణయాలు సంస్థను నష్టాల బాట పట్టిస్తున్నాయని ఆరోపించారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 14వ తేదీ బుధవారం సాయంత్రం 5 గంటలకు రామగుండంలో నిర్వహించనున్న సింగరేణి కార్మిక గర్జన సభను విజయవంతం .........(తరువాయి 2లో)





## ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయం

రూ.500 కోట్లు ఖర్చు పెట్టినా కాంగ్రెస్ అభ్యర్థి గెలవడు
ఎమ్మెల్సీ ఎన్నికలు క్వార్టర్ ఫైనల్స్..
పట్టభద్రుల ఓట్ల నమోదుపై పార్టీ శ్రేణులు దృష్టి పెట్టాలి
పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి
రేవంత్ మూడేళ్ల సంపాదన రూ.50 వేల కోట్లు
కుటుంబ సభ్యుల పేర్లతో కంపెనీలు, పారశాలలు
రూ.8వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్
బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

3లో..



## మోదీ గద్దె దిగు

జనాభా 140 కోట్లు దాటితే 13 కోట్ల ఓట్లు గల్లంతు ఎలా?
దళితులు, మైనారిటీలు, ఆదివాసీల ఓట్ల తొలగింపు వెనుక భారీ కుట్ర
ఈడీ, ఐటీ, సీబీఐ దాడులు బీజేపీ ప్రభుత్వాన్ని రక్షించలేవు
ఓటు హక్కును అణగారిన వర్గాల నుంచి గుంజుకునే ప్రయత్నం
ఎన్నికల సంఘం తీరుపై ప్రతిపక్షాల ఆందోళన
ప్రజల హక్కుల పరిరక్షణకే ఉద్యమమన్న రేవంత్‌రెడ్డి

కాకతీయ,తెలంగాణ బ్యూరో : ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని దొడ్డిదారిన అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తే ప్రజలు తిరుగుబాటు చేస్తారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. సీఈసీ జ్ఞానేష్‌కుమార్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెంటనే భర్తరఫ్ చేయాలని, లేకుంటే ప్రధాని పదవిని ఖాళీ చేయాలని, లేదంటే ప్రజలే గద్దె దించుతారని అన్నారు. ఈడీ, ఆదాయపు పన్ను శాఖ, సీబీఐ దాడులు ఇకపై బీజేపీ ప్రభుత్వాన్ని రక్షించలేవని స్పష్టం చేశారు. ఓటు బచావో–దేశ్ బచావో ఉద్యమంలో భాగంగా రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, ప్రియాంకగాంధీ, కేసీ వేణుగోపాల్, ఇండియా కూటమి నేతలతో కలిసి రాజ్‌ఘాట్ వరకు ప్రదర్శన నిర్వహించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2014 ఎన్నికల నాటికి దేశంలో 81 కోట్ల మంది ఓటర్లు ఉండగా, 2019 నాటికి 91 కోట్లకు, 2024 నాటికి 97 కోట్లకు పెరిగారని రేవంత్‌రెడ్డి తెలిపారు. దేశ జనాభా 140 కోట్లకు చేరిన సమయంలో ఓటర్ల సంఖ్య మరింత పెరగాల్సి ఉండగా 13 కోట్ల ఓట్లు గల్లంతయ్యాయని పేర్కొన్నారు. ఓటర్ల సంఖ్య తగ్గడానికి కారణమేంటో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.........(తరువాయి 2లో)




## నైరుతి రుతుపవనాల తిరోగమనం

జనగాం, భూపాలపల్లి మీదుగా కొనసాగుతున్న ఉపసంహరణ

కాకతీయ, తెలంగాణ బ్యూరో : తెలంగాణ నుంచి నైరుతి రుతుపవనాలు పూర్తిగా నిష్క్రమించే దిశగా కదులుతున్నాయి. అక్టోబర్ 8న రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల నుంచి నైరుతి రుతుపవనాలు మరింతగా ఉపసంహరించుకున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ప్రస్తుతం రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల తిరోగమన రేఖ తాండూర్, వికారాబాద్, హైదరాబాద్, జనగాం, భూపాలపల్లి మీదుగా కొనసాగుతున్నట్లు తెలిపింది. మహారాష్ట్రలోని మిగిలిన ప్రాంతాలు, గోవా, కర్ణాటక, తెలంగాణ, ఒడిశాలోని కొన్ని ప్రాంతాలు, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌లోని మరికొన్ని ప్రాంతాల నుంచి నైరుతి రుతుపవనాలు మరింతగా తిరోగమించినట్లు వాతావరణ శాఖ పేర్కొంది. తిరోగమన రేఖ సుపాల్, రాంచీ, సుందర్‌గఢ్, బర్గఢ్, బీజాపూర్, హైదరాబాద్, బెళగావి, పనాజీ మీదుగా కొనసాగుతోందని తెలిపింది. ఉపహిమాలయ పశ్చిమ బెంగాల్ నుంచి దక్షిణ అంతర్గత కర్ణాటక వరకు ఉన్న ద్రోణి తూర్పు ఉత్తరప్రదేశ్ నుంచి రాయలసీమ వరకు విస్తరించి, అక్టోబర్ 8న తెల్లవారుజామున బలహీనపడినట్లు వాతావరణ కేంద్రం తెలిపింది. తెలంగాణలో అక్టోబర్ 8, 9, 10 తేదీల్లో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. రాష్ట్రంలో ఎలాంటి వాతావరణ హెచ్చరికలు లేవని స్పష్టం చేసింది. రాబోయే 3 నుంచి 4 రోజుల్లో తూర్పు భారతదేశం, ఉత్తర ద్వీపకల్పంలోని మరికొన్ని ప్రాంతాలు, ఈశాన్య భారతదేశంలోని అనేక ప్రాంతాల నుంచి నైరుతి రుతుపవనాలు మరింతగా తిరోగమించేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

ఉత్తరం
# కాకతీయ

శుక్రవారం
09 అక్టోబర్
2026



# నానా పటేకర్ కన్నుమూత!

**దిగ్గజ నటుడి మృతితో భారతీయ చిత్ర పరిశ్రమలో విషాదం**

**సహజ నటనతో కోట్లాది మంది అభిమానులను సంపాదించిన కళాకారుడు**

**భావోద్వేగ నివాళి అర్పించిన ఐకాన్ స్టార్ అల్లు అర్జున్**

కాకతీయ, నేషనల్ డెస్క్ : భారతీయ చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విలక్షణ నటనతో దశాబ్దాల పాటు ప్రేక్షకులను అలరించిన దిగ్గజ నటుడు నానా పటేకర్ కన్నుమూశారన్న వార్తతో సినీ రంగం దిగ్భ్రాంతికి గురైంది. గోవాలోని తన నివాసంలో గుండెపోటుతో ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపినట్లు సమాచారం. నానా పటేకర్ మృతి పట్ల టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నటనలో కొత్త ఒరవడి సృష్టించిన కళాకారుడిగా, స్ఫూర్తిదాయకమైన నటుడిగా ఆయనను కొనియాడారు. సహజ నటనతో భారతీయ సినిమాలో అరుదైన ఆణిముత్యంగా నిలిచారని పేర్కొన్నారు. ఆయన నటన ఎప్పటికీ స్ఫూర్తినిస్తుందని, నటనా నైపుణ్యం చిరకాలం గుర్తుండిపోతుందని నివాళి అర్పించారు. నానా పటేకర్ కుటుంబ సభ్యులకు, ఆప్తులకు అల్లు అర్జున్ ప్రేమతో కూడిన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. సంభాషణలు పలికించడంలో తనదైన శైలి, ఎలాంటి పాత్రలోనైనా జీవించే నటనతో నానా పటేకర్ కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. ఆయన మరణంతో భారతీయ సినిమా ఒక గొప్ప నటుడిని కోల్పోయిందని సినీ అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# స్విట్జర్లాండ్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పర్యటన

**ప్రజాస్వామ్య వ్యవస్థల అధ్యయనంతో పార్లమెంటరీ విధానాలపై అవగాహన :తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**

బెర్న్: ప్రపంచ దేశాల ప్రజాస్వామ్య వ్యవస్థలను అధ్యయనం చేయడం ద్వారా పార్లమెంటరీ విధానాలు, శాసనసభల నిర్వహణపై మరింత అవగాహన పెంపొందించుకోవచ్చని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన విదేశీ అధ్యయన పర్యటనలో భాగంగా గురువారం స్విట్జర్లాండ్‌లోని బెర్న్ నగరంలో ఉన్న చారిత్రాత్మక పార్లమెంట్ భవనాన్ని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ సందర్శించారు. ఈ సందర్భంగా స్విట్జర్లాండ్ పార్లమెంటరీ వ్యవస్థ, ప్రజాస్వామ్య సంప్రదాయాలు, చట్టాల రూపకల్పన, శాసనసభల పనితీరు, ప్రజాప్రతినిధుల బాధ్యతలపై అధ్యయనం చేశారు. ప్రజాస్వామ్యంలో శాసనసభలు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చట్టాలు రూపొందించడం, ప్రభుత్వ విధానాలపై చర్చించడం, ప్రజా సమస్యలకు పరిష్కారాలు అన్వేషించడం ప్రజాప్రతినిధుల ప్రధాన బాధ్యతలని ప్రసాద్ కుమార్ తెలిపారు. వివిధ దేశాల పార్లమెంటరీ విధానాలను పరిశీలించడం ద్వారా పారదర్శకత, జవాబుదారీతనం వంటి ప్రజాస్వామ్య విలువలపై అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ పర్యటనలో శాసనసభ కార్యదర్శి రెండ్ల తిరుపతి, శాసనమండలి కార్యదర్శి డా. నరసింహాచార్యులు, స్పీకర్ ఓఎస్డీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# జీరో దందాపై ఆరా

(మొదటి పేజీ తరువాయి)

, వాటిపై తీసుకున్న చర్యలు స్పష్టంగా తెలియకముందే మరోసారి తనిఖీలు జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆగస్టు 14న 'కాకతీయ'లో ఏనుమాముల మార్కెట్ వ్యవహారాలపై వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. అనంతరం రెండు బృందాలు తనిఖీలు చేపట్టాయి. ఒక బృందం కోల్డ్‌స్టోరేజీల్లో మిర్చి నిల్వలు, జీరో దందాగా ప్రచారంలో ఉన్న లావాదేవీలను పరిశీలించింది. మరో బృందం తక్ పట్టీలు, లాట్ ఐడీలు, కాంటా చిట్టీలు, బిడ్డింగ్, ఇన్‌వార్డ్, అవుట్‌వార్డ్ రిజిస్టర్లను పరిశీలించింది. పత్తి, మిర్చి, పల్లీ, పసుపు, అపరాల లావాదేవీల్లో రికార్డులు, క్షేత్రస్థాయి వివరాల మధ్య వ్యత్యాసాలపైనా ఆరా తీసినట్లు సమాచారం. అయితే ఆ తనిఖీల నివేదికలు, వాటిపై తీసుకున్న చర్యలు ఇప్పటివరకు బహిర్గతం కాలేదు.

**ఇప్పుడు ఐదుగురితో మరో బృందం**

తాజాగా అడిషనల్ కమిషనర్ పర్యవేక్షణలో ఐదుగురు సభ్యుల బృందం మార్కెట్‌కు చేరింది. డీఎంఓ నాగరాజు ఆధ్వర్యంలో కరీంనగర్ నుంచి ఇద్దరు, ఖమ్మం, నల్గొండ నుంచి ఒక్కొక్కరు చొప్పున కార్యదర్శులు ఉన్నట్లు సమాచారం. గురువారం బృందం రసీదులు, తక్ పట్టీలు, కాంటా చిట్టీలు, ఇన్‌వార్డ్, అవుట్‌వార్డ్, గేట్ ఎంట్రీ రిజిస్టర్లను పరిశీలించింది. రాష్ట్రంలోని మరో మార్కెట్‌లో ఆర్ధీ ధరకు సంబంధించిన వివాదం నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలకు ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. వాహనాల్లో మార్కెట్‌కు వచ్చిన పత్తికి తక్ పట్టీలు లేకుండా లావాదేవీలు జరిగాయా? కోల్డ్‌స్టోరేజీల్లో రికార్డుల్లో కనిపించని లావాదేవీలు ఉన్నాయా? కాంటా చిట్టీల వివరాలు తక్ పట్టీలతో సరిపోతున్నాయా? గేట్ ఎంట్రీలు మార్కెట్ రికార్డులతో సరిపోలుతున్నాయా? అనే అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. సరుకు పరిమాణం, వ్యాపారి వివరాలు,







ఉత్తరం కాకతీయలో ప్రచురితమైన కథనాలు(ఫైల్)

కాంటా బరువు, తక్ పట్టీ, వాహనం, గేట్ ఎంట్రీలను పరస్పరం సరిపోల్చుతున్నట్లు సమాచారం.

**తక్ పట్టీ నుంచి గేట్ ఎంట్రీ వరకు**

తక్ పట్టీ నుంచి కాంటా చిట్టీ, ఇన్‌వార్డ్, ఔట్‌వార్డ్ వరకు నమోదైన వివరాలను ఒకదానితో ఒకటి పోల్చుతున్నారు. మార్కెట్‌లోకి సరుకు ఎక్కడి నుంచి వచ్చింది, ఎంత వచ్చింది, ఎవరి లావాదేవీ, ఎంత బరువు నమోదైంది, తక్ పట్టీ జారీ అయిందా, సరుకు బయటకు వెళ్లినప్పుడు గేట్ ఎంట్రీ ఉందా అన్నది పరిశీలనలో కీలకంగా మారింది. ఈ నమోదుల్లో తేడాలు ఉంటే వాటి ఆధారంగా తదుపరి విచారణకు అవకాశం ఉంటుంది. ఆగస్టులో తనిఖీలు పూర్తయిన తర్వాత నివేదికల్లో ఏం తేలిందన్నది ఇప్పటికీ స్పష్టంగా లేదు. అప్పట్లో గుర్తించిన అంశాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? తాజా తనిఖీల అవసరం ఎందుకు వచ్చింది? వరుస తనిఖీలకు నిర్దిష్ట కారణాలేమిటి? అన్నది అధికారులు వెల్లడించాల్సి ఉంది. తాజా తనిఖీల్లోనూ ఎలాంటి వ్యత్యాసాలు బయటపడ్డాయో నివేదిక వచ్చాకే స్పష్టమవుతుంది. తనిఖీలు జరగడం మాత్రమే అక్రమాలు నిర్ధారించడానికి ఆధారం కాదు. గత, తాజా నివేదికలను బహిర్గతం చేస్తే మార్కెట్‌లోని వాస్తవ పరిస్థితిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# సింగరేణిని కుంభకోణాల గనిగా మార్చారు

(మొదటి పేజీ తరువాయి)



చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. దసరాకు ముందు సింగరేణి లాభాలను ప్రకటించి కార్మికులకు వాటా చెల్లించడం ఆనవాయితీగా వస్తోందని హరీశ్‌రావు అన్నారు. అయితే ఈ ఏడాది పండుగ సమీపిస్తున్నా లాభాలను ప్రకటించడం లేదని, కార్మికులకు ఎంత వాటా ఇస్తారో వెల్లడించడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 32 శాతం లాభాల వాటా ఇచ్చామని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది 33 శాతం ఇస్తామని చెప్పి వాస్తవంగా 16 శాతమే ఇచ్చిందని ఆరోపించారు. 2024–25లో వాటా 12.5 శాతానికి తగ్గిందన్నారు. లాభాల్లో కొంత మొత్తాన్ని భవిష్యత్తు అవసరాల పేరుతో పక్కనపెట్టి వాటా పంపిణీ చేస్తున్నారని విమర్శించారు. 2022–23లో రూ.2,022 కోట్లు, 2023–24లో రూ.4,712 కోట్లు, 2024–25లో రూ.6,394 కోట్ల లాభాలు వచ్చినట్లు పేర్కొన్న ఆయన, ప్రస్తుత ఏడాది లాభాలను ప్రకటించకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తమకు అందిన సమాచారం ప్రకారం ఈ ఏడాది లాభాలు రూ.1,800 కోట్లు కూడా మించకపోవచ్చని, ఇంత భారీ తగ్గుదలకు కారణాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**కార్మికుల ఉత్పాదకత పెరిగినా ఉత్పత్తి తగ్గిందా?**

కార్మికుల ఉత్పాదకత గతంలో ఒక్కో కార్మికుడి షిఫ్టుకు 6.39 టన్నులుగా ఉండగా, ఈ ఏడాది 7.56 టన్నులకు పెరిగిందని హరీశ్‌రావు తెలిపారు. కార్మికులు మరింత కష్టపడి పనిచేస్తున్నప్పటికీ సంస్థ మొత్తం బొగ్గు ఉత్పత్తి తగ్గడం పాలనా వైఫల్యానికి నిదర్శనమని ఆరోపించారు. 2023–24లో 70 మిలియన్ టన్నులుగా ఉన్న ఉత్పత్తి 2025–26లో 58 మిలియన్ టన్నులకు పడిపోయిందని, 12 మిలియన్ టన్నుల తగ్గుదలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సకాలంలో గనులను ప్రారంభించకపోవడం, కాంట్రాక్టర్లకు చెల్లింపులు నిలిపివేయడం, టెండర్లను నెలల తరబడి వాయిదా వేయడం, అధిక ధరలకు టెండర్లు కట్టబెట్టడం వంటి చర్యలు సంస్థపై ప్రభావం చూపుతున్నాయని ఆరోపించారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ల నిబంధనలు, రేవంత్‌రెడ్డి బంధువులకు టెండర్లు కట్టబెట్టారన్న ఆరోపణలపైనా విచారణ జరగాలని అన్నారు. నిజాయితీగా పనిచేసే అధికారులు, డైరెక్టర్లను తొలగించారని విమర్శించారు.

**రూ.50 వేల కోట్ల బకాయిలు పెండింగ్?**

సింగరేణికి ప్రభుత్వం, జెన్‌కో నుంచి రావాల్సిన చెల్లింపులు నిలిచిపోయాయని, మొత్తం బకాయిలు రూ.50 వేల కోట్ల వరకు ఉన్నాయని హరీశ్‌రావు ఆరోపించారు. లాభాలుగా వచ్చిన రూ.6,323 కోట్లను బ్యాంకుల్లో ఉంచి, మరోవైపు రూ.4 వేల కోట్ల ఓవర్‌డ్రాఫ్ట్ ఎందుకు తీసుకువస్తున్నారని ప్రశ్నించారు. జీతాల చెల్లింపుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందో ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేశారు. బొగ్గు కొరత కారణంగా థర్మల్ విద్యుత్ ఉత్పత్తికి ఆటంకాలు ఏర్పడి, రైతులు విద్యుత్ సమస్యలపై రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారని ఆరోపించారు. 40 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు చూపించారని గతంలో తాము ప్రశ్నించినా సమాధానం రాలేదని, దీనిపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. బొగ్గు ఉత్పత్తి, నిల్వలు, విద్యుత్ ఉత్పత్తిపై సమగ్ర పరిశీలన జరగాలని అన్నారు.

**జీవో 76 అమలు చేయాలి**

సింగరేణి కార్మికులకు ఇంటి స్థలాలపై హక్కులు కల్పించేందుకు 2019లో కేసీఆర్ ప్రభుత్వం జీవో 76 తీసుకొచ్చిందని హరీశ్‌రావు తెలిపారు. సింగరేణి ప్రాంతంలో 30 వేల మందికి ఇళ్ల రిజిస్ట్రేషన్లు చేసి అప్పగించామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిన స్థలాలను నిషేధిత జాబితాలో పెట్టిందని ఆరోపించారు. మంచిర్యాలలోనే వేలాది స్థలాలు నిషేధిత జాబితాలో ఉన్నాయని పేర్కొన్నారు. మూడేళ్లుగా సమస్యను పరిష్కరించకుండా ఇప్పుడు ఉపశమనం కల్పించినట్లు చెప్పడం సరికాదన్నారు. జీవో 76 కింద మిగిలిన కార్మికులకు సేల్ డీడ్ ద్వారా హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో 16 వేల డిపెండెంట్ ఉద్యోగాలు ఇచ్చామని, మరో 4 వేల మందికి పరీక్షలు నిర్వహించి ఉద్యోగాలు కల్పించామని హరీశ్‌రావు పేర్కొన్నారు. మొత్తంగా 20 వేల మందికి ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. ప్రస్తుతం డిపెండెంట్ ఉద్యోగాలపై అప్రకటిత నిషేధం కొనసాగుతోందని ఆరోపించారు. గతంలో మాదిరిగా ప్రతి నెలా మూడు మెడికల్ బోర్డులు నిర్వహించి అర్హులకు ఉద్యోగాలు ఇవ్వాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సింగరేణి ఎన్నికలను వెంటనే నిర్వహించాలని, కార్మికులకు లాభాల్లో పూర్తి వాటా చెల్లించాలని, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని అన్నారు.

**ప్రైవేటీకరణ ప్రయత్నాలను అడ్డుకుంటాం**

సింగరేణిని ప్రైవేటీకరించే ప్రయత్నాలను మానుకోవాలని, సంస్థను కాపాడుకునేందుకు కేంద్ర బొగ్గు మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి చొరవ తీసుకుని కొత్త గనులు కేటాయించాలని హరీశ్‌రావు కోరారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై బీఆర్ఎస్ ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమవుతోందని స్పష్టం చేశారు. ఈ నెల 14న రామగుండంలో జరిగే సింగరేణి కార్మిక గర్జనకు కార్మికులు, సింగరేణి ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# బతుకమ్మతోనే తెలంగాణ సంస్కృతికి ప్రత్యేక గుర్తింపు

**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

కాకతీయ,తెలంగాణ బ్యూరో : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. తెలంగాణ ఆడపడుచుల సాంస్కృతిక ఐక్యతకు, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి బతుకమ్మ గొప్ప ప్రతీక అని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులు, ఉద్యోగినులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ సంప్రదాయాల పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకల నిర్వహణకు చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా రూపొందించిన పోస్టర్‌ను గురువారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆవిష్కరించారు. బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు.

**మహిళా ఉద్యోగులతో వేడుకలకు ఏర్పాట్లు**

మహిళా ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు టీ.జీ.ఓ. మహిళా విభాగం ప్రతినిధులు తెలిపారు. మహిళా ఉద్యోగుల్లో సాంస్కృతిక చైతన్యం, ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు తెలంగాణ సంప్రదాయాలను భావితరాలకు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. పూలతో బతుకమ్మను పేర్చి, ప్రకృతిని ఆరాధిస్తూ సమిష్టిగా పాటలు పాడుతూ నిర్వహించే ఈ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిందని మహిళా విభాగం నాయకులు తెలిపారు. బతుకమ్మ తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక అని, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులందరూ వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీ.జీ.ఓ. అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు, ప్రధాన



కార్యదర్శి బి.శ్యామ్, మహిళా విభాగం చైర్‌పర్సన్ డా. జి.దీపారెడ్డి, కన్వీనర్ జె.సుజాత, శాంతిశ్రీ, కిరణ్మయి, పూనం, అనిత, మమత, చంద్రజ్యోతి, వనజతో పాటు వివిధ శాఖలకు చెందిన మహిళా గెజిటెడ్ అధికారులు, ఉద్యోగినులు పాల్గొన్నారు.

# మోదీ గద్దె దిగు..

(మొదటి పేజీ తరువాయి)

మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్, భగత్‌సింగ్ వంటి నాయకులు స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను త్యాగం చేశారని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. సంపన్నులు, పేదలు అనే తేడా లేకుండా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించారని అన్నారు. ఇప్పటివరకు ఎన్నికలు ఎన్నిసార్లు జరిగినా పేదల ఓటు హక్కుకు ముప్పు రాలేదని, ఇప్పుడు రాజ్యాంగం కల్పించిన హక్కును అణగారిన వర్గాల నుంచి గుంజుకునే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, మైనారిటీలు బీజేపీకి వ్యతిరేకంగా తీర్పు ఇస్తున్నారనే కారణంతో వారి ఓట్లను లక్ష్యంగా చేసుకుని తొలగిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎన్నికల సంఘం తప్పులను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతలపై పోలీసులతో దాడులు చేయించడం, ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన నేతలను ఎన్నికల సంఘం కలవకపోవడం వెనుక భారీ కుట్ర ఉందని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. కులం, మతం, ప్రాంతం, భాష పేరుతో ప్రజలను విభజించి బీజేపీ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ఇప్పుడు ప్రజలను ఓటు ఉన్నవారు, ఓటు లేనివారుగా రెండు వర్గాలుగా విభజించే పరిస్థితి ఏర్పడిందన్నారు. బీజేపీకి అనుకూలంగా ఉన్నవారికి ఒక వైపు, వ్యతిరేకంగా ఉన్న పేదలకు మరో వైపు అన్నట్లుగా పరిస్థితులను మార్చేందుకు మోదీ, జ్ఞానేష్‌కుమార్ ప్రయత్నిస్తున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు.

**కాంగ్రెస్.. ఇండియా కూటమి కోసం కాదన్న రేవంత్**

ఓటు బచావో–దేశ్ బచావో ఉద్యమం కాంగ్రెస్ పార్టీ కోసం లేదా ఇండియా కూటమి కోసం చేస్తున్న పోరాటం కాదని, దేశంలోని సామాన్యుల ఓటు హక్కు పరిరక్షణ కోసం చేపట్టిన ఉద్యమమని రేవంత్‌రెడ్డి అన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగించి రాజకీయంగా పైచేయి సాధించే ప్రయత్నాలు ఇక సాగవని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈడీ, ఆదాయపు పన్ను శాఖ, సీబీఐ దాడులతో బీజేపీ ప్రభుత్వాన్ని రక్షించడం సాధ్యం కాదని పేర్కొన్నారు. ప్రజల ఓటు హక్కును కాపాడుకునే పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**మోదీ, జ్ఞానేష్‌కుమార్‌పై తీవ్ర విమర్శలు**

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైన రాజ్యాంగ హక్కు అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ హక్కును దెబ్బతీసే ఎలాంటి చర్యలనైనా వ్యతిరేకిస్తామని అన్నారు. ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై వస్తున్న అభ్యంతరాలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని డిమాండ్ చేశారు. సీఈసీ జ్ఞానేష్‌కుమార్‌ను భర్తరఫ్ చేయకపోతే ప్రధాని నరేంద్రమోదీ గద్దె దిగాలని, లేకపోతే ప్రజలే గద్దె దింపుతారని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ఓటు హక్కును కాపాడుకోవడం అంటే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడమేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అణగారిన వర్గాలు, పేదలు, మైనారిటీల ఓటు హక్కును పరిరక్షించేందుకు ఉద్యమాన్ని మరింత విస్తరిస్తామని ప్రకటించారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీసే చర్యలకు కేంద్రం, ఎన్నికల సంఘం తావివ్వకూడదని ఆయన కోరారు.

# రూ.5,420 కోట్ల కరెంట్ భారం!

(మొదటి పేజీ తరువాయి)

డిసెంబర్ నుంచి యూనిట్‌కు 50 పైసలకు పెరగనుంది. వినియోగించే యూనిట్ల సంఖ్యను బట్టి ప్రతి నెలా బిల్లులో అదనపు మొత్తం చేరనుంది. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని వినియోగదారులపై కూడా ఇదే విధంగా ట్రూ అప్ ఛార్జీలు అమలవుతాయి. అయితే ఇక్కడ అదనపు భారం పడే కాలపరిమితి 26 నెలలుగా నిర్ణయించారు. అంటే దక్షిణ, ఉత్తర తెలంగాణల్లో వినియోగదారులపై ట్రూ అప్ ఛార్జీల వసూలు వ్యవధి వేర్వేరుగా ఉండనుంది.

**53 లక్షల కుటుంబాలకు ఊరట**

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాష్ట్రంలోని ప్రతి విద్యుత్ వినియోగదారుడిపై ఒకే విధంగా ప్రభావం చూపదు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే సుమారు 53 లక్షల కుటుంబాలకు ట్రూ అప్ ఛార్జీల నుంచి మినహాయింపు ఇచ్చారు. దీంతో ఈ పరిమితిలోపు వినియోగించే కుటుంబాలకు కొత్త ఛార్జీల భారం ఉండదు. 200 యూనిట్లకు మించి విద్యుత్ వినియోగించే కుటుంబాలపైనే అదనపు భారం పడనుంది. సాధారణ మధ్యతరగతి కుటుంబాల్లో ఫ్రిజ్, ఫ్యాన్లు, లైట్లు, టీవీ, ఇతర గృహోపకరణాల వినియోగంతో 200 యూనిట్ల పరిమితిని దాటే పరిస్థితి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. దీంతో గృహజ్యోతి మినహాయింపు పొందని మధ్యతరగతి కుటుంబాలపై ట్రూ అప్ ఛార్జీల ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.

**గతంలో రూ.12,403 కోట్లను ప్రభుత్వమే భరించింది**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డిస్కంలకు వచ్చిన రూ.12,403 కోట్ల అదనపు భారాన్ని ప్రభుత్వమే భరించి చెల్లించిందని విమర్శలు వస్తున్నాయి. అప్పట్లో వినియోగదారులపై నేరుగా భారం మోపకుండా ప్రభుత్వమే ఆ మొత్తాన్ని భరించిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం డిస్కంల నష్టాలను ప్రజల నుంచి వసూలు చేయడం సరైన విధానం కాదని మధ్యతరగతి వర్గాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుత జీవన విధానంలో 200 యూనిట్ల విద్యుత్ సాధారణ కుటుంబ అవసరాలకు సరిపోదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒక ఇంట్లో ఫ్రిజ్, ఫ్యాన్లు, లైట్లు, టీవీ వంటి సాధారణ విద్యుత్ పరికరాలు వినియోగించినా నెలవారీ వినియోగం 200 యూనిట్లకు చేరుకునే అవకాశం ఉందని వినియోగదారులు చెబుతున్నారు. అలాంటి కుటుంబాలకు గృహజ్యోతి పథకం మినహాయింపు వర్తించకపోవడంతో ట్రూ అప్ ఛార్జీల ప్రభావం నేరుగా కరెంటు బిల్లుపై పడనుంది.

**పాత భారాలకు కొత్త వసూళ్లా?**

డిస్కంల ఆర్థిక నష్టాలను సరిచేసేందుకు వినియోగదారుల నుంచి ట్రూ అప్ ఛార్జీలు వసూలు చేయడం వల్ల గత కాలానికి సంబంధించిన ఆర్థిక భారాన్ని ప్రస్తుత వినియోగదారులపైకి మళ్లించినట్లవుతుందని విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యుత్ రంగంలో గత నిర్ణయాలు, ఒప్పందాలు, సంక్షేమ పథకాల వల్ల ఏర్పడిన నష్టాలకు ప్రస్తుత వినియోగదారులు అదనపు మొత్తం చెల్లించాల్సి రావడం మధ్యతరగతి కుటుంబాలకు ఇబ్బందికరంగా మారనుందని ప్రజా వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికే నిత్యావసరాల ధరలు, పన్నులు, ఇతర ఖర్చులతో కుటుంబ బడ్జెట్లు ఒత్తిడిలో ఉన్న సమయంలో విద్యుత్ బిల్లులపై అదనపు భారం మోపడం పునరాలోచించాల్సిన అంశమని వినియోగదారులు కోరుతున్నారు. డిస్కంల నష్టాలను భర్తీ చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ, ఆ భారాన్ని మొత్తం వినియోగదారులపైకి మళ్లించే బదులు ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# పేదల ఇళ్ల కూల్చివేత ఆపాలి

**కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి ధ్వజం**

కాకతీయ, హనుమకొండ : హైకోర్టు స్టే ఉన్నప్పటికీ భద్రకాళి ఆలయం వెనుక చరబండ్ల రాజుల కాలనీలో పేదల ఇళ్లను కూల్చివేయడం కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి అన్నారు. పేదలు, దళితుల ఇళ్ల కూల్చివేతను వెంటనే నిలిపివేసి, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వారిపైనే దాడులకు పాల్పడుతోందని విమర్శించారు. బాలసముద్రంలోని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రకాళి ఆలయం వెనుక ఉన్న చరబండ్ల రాజుల కాలనీ వాసులు ఎన్నో ఏళ్లుగా అక్కడ నివసిస్తున్నారని, తమ సమస్యల పరిష్కారం కోసం బండలు కొట్టి దారి ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. అలాంటి నిరుపేదల ఇళ్లను అక్రమంగా కూల్చివేయడం దారుణమన్నారు.

**ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా?**

ఎన్నికల ముందు దళితులకు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పక్కన పెట్టిందని మర్రి యాదవ రెడ్డి విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యం తీసుకొస్తామని చెప్పిన నాయకులు నిరుపేదల ఇళ్లను కూల్చివేస్తూ ఎలాంటి రాజ్యాన్ని తీసుకొస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ప్రజలు ఓటు వేసి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించినప్పుడు వారి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంటుందని అన్నారు. హైకోర్టు స్టే ఉన్నప్పటికీ ఇళ్ల కూల్చివేత జరిగితే ప్రభుత్వం తక్షణమే వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో పేదలు, దళితుల ఇళ్లపై ఇలాంటి చర్యలు జరిగాయా అని ప్రశ్నించారు. నాయిని రాజేందర్‌రెడ్డి ప్రమేయంతోనే అక్రమ కేసులు నమోదయ్యాయనే ఆరోపణలు వస్తున్నాయని, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ వారి తరపున పోరాడుతుందని స్పష్టం చేశారు. మాజీ కార్పొరేటర్ జోరికే రమేష్ మాట్లాడుతూ ఢిల్లీలో రాహుల్‌గాంధీ ధర్నాకు సంఘీభావంగా కాంగ్రెస్ నాయకులు నిరసనలు చేస్తుంటే, రాష్ట్రంలో ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ నాయకులు ప్రజాస్వామ్యబద్ధంగా ధర్నా చేస్తే అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. ఒకే దేశంలో, ఒకే రాష్ట్రంలో ప్రతిపక్షాలకు ఒక న్యాయం, అధికార పార్టీకి మరో న్యాయమా అని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తే కేసులు పెట్టడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. వరంగల్ నగర అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, రాజకీయ కక్ష సాధింపులకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. రాబోయే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలని జోరికే రమేష్ డిమాండ్ చేశారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయం

**ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయం**

**రూ.500 కోట్లు ఖర్చు పెట్టినా కాంగ్రెస్ అభ్యర్థి గెలవడు**

**ఎమ్మెల్సీ ఎన్నికలు క్వార్టర్ ఫైనల్స్..**

**పట్టభద్రుల ఓట్ల నమోదుపై పార్టీ శ్రేణులు దృష్టి పెట్టాలి**

**పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఏనుగుల రాకేష్‌రెడ్డిని గెలిపించాలి**

**రేవంత్ మూడేళ్ల సంపాదన రూ.50 వేల కోట్లు**

**కుటుంబ సభ్యుల పేర్లతో కంపెనీలు, పాఠశాలలు**

**రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్**

**ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్టర్లకు టెండర్లు ఇవ్వడం లేదు**

**బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్**



కాకతీయ, నల్గొండ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూడేళ్ల పాలనలో రూ.50 వేల కోట్లు అక్రమంగా సంపాదించారని, ప్రజల సొమ్మును కుటుంబ సభ్యుల ఖాతాలకు మళ్లించారని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ఈ మొత్తంలో రూ.500 కోట్లు ఖర్చు చేసినా కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గెలవలేరని వ్యాఖ్యానించారు. నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సభలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పట్టభద్రుల ఓట్లను సమీకరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ముఖ్యమంత్రి సతీమణి గీతారెడ్డి పేరుతో హ్యుండాయ్ కార్ల షోరూంలు ప్రారంభించారని విమర్శించారు. గతంలో కేసీఆర్ దళిత బంధు పథకం ద్వారా ఎస్సీ వర్గాల పేదలకు ఆర్థిక సహాయం అందించి, వారు సొంతంగా కార్లు కొనుగోలు చేసేలా ప్రోత్సహించారని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం పేదల సంక్షేమం కంటే కుటుంబ వ్యాపారాలకు ప్రాధాన్యమిస్తోందని ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి సభలో ఎలాంటి ఆధారాలను ఆయన వివరించలేదు.

## గురుకులాలకు బదులు ప్రైవేటు పాఠశాలలా?

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థుల కోసం రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి గురుకులాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్య అందించిందని ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల పేర్లతో ప్రైవేటు అంతర్జాతీయ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ పరిసరాల్లో మైండ్ వాల్ట్ పేరుతో అంతర్జాతీయ పాఠశాలలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పేదలకు ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం ప్రైవేటు విద్యా వ్యాపారాలకు ప్రాధాన్యమిస్తోందని ఆరోపించారు. గత ప్రభుత్వం పేదల వైద్య అవసరాల కోసం జిల్లాల్లో ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రులను ఏర్పాటు చేసిందని ప్రవీణ్‌కుమార్ అన్నారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెడికవర్ ఆసుపత్రుల ప్రారంభోత్సవాలకు హాజరై ప్రచారం చేశారని, ఆ ఆసుపత్రులను చివరకు రూ.3,200 కోట్లకు విక్రయించారని పేర్కొన్నారు. ఆ సంస్థ డైరెక్టర్‌గా ముఖ్యమంత్రి అల్లుడు సత్యనారాయణరెడ్డి ఉన్నారని ఆరోపించారు. కుటుంబ సభ్యులకు సంబంధించిన వ్యాపారాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## విద్యార్థులు, నిరుద్యోగులకు అన్యాయం

రాష్ట్రంలో విద్యార్థులకు రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోందని ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. ఏటా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి నిరుద్యోగులను మోసం చేశారని ఆరోపించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలోనూ ప్రభుత్వం విఫలమైందన్నారు. విద్య, ఉపాధి, ఉద్యోగ భద్రత వంటి అంశాలపై పట్టభద్రులు ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. నల్గొండ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్టర్లకు టెండర్లు ఇవ్వకుండా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. కోమటిరెడ్డి పృథ్వీరెడ్డికి టెండర్లు కట్టబెడుతున్నారని విమర్శించారు. కమీషన్ల కోసం పేద కాంట్రాక్టర్లకు అన్యాయం చేస్తున్నారని ఆరోపిస్తూ, ఈ వ్యవహారంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వ అవినీతిపై ప్రశ్నిస్తే వారిని జైలుకు పంపేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలు క్వార్టర్ ఫైనల్స్

రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వాన్ని ఓడించేందుకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను క్వార్టర్ ఫైనల్స్‌గా భావించాలని ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించి తదుపరి ఎన్నికలకు మరింత ఉత్సాహంతో ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు సూచించారు. నల్గొండ జిల్లాలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని, ప్రతి రెండు రోజులకోసారి సమావేశం నిర్వహించి పురోగతిని సమీక్షించాలని సూచించారు.

ఓట్ల లెక్కింపు వరకు నల్గొండ జిల్లా ఓటరు నమోదు ప్రక్రియలో ముందంజలో ఉండాలని పిలుపునిచ్చారు. గత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏనుగుల రాకేష్‌రెడ్డి స్వల్ప తేడాతో ఓడిపోయారని, ఈసారి ఆయనను గెలిపించాలని ప్రవీణ్‌కుమార్ కోరారు. బిట్స్ పిలానీలో చదువుకున్న రాకేష్‌రెడ్డి విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారని పేర్కొన్నారు. పట్టభద్రుల సమస్యలను శాసన మండలిలో బలంగా వినిపించేందుకు ఆయనకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అధ్యక్షత వహించగా, ఏనుగుల రాకేష్‌రెడ్డి, జిల్లా ప్రజాప్రతినిధులు, మాజీ చైర్మన్లు, పార్టీ కార్యకర్తలు, పట్టభద్రులు హాజరయ్యారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కాకతీయ,రాయపర్తి : వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని మైలారం గ్రామంలో గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో ఓ మహిళ దారుణంగా ప్రాణాలు కోల్పోయింది.స్థానికులు,పోలీసులు తెలిపిన వివరాల మేరకు...మైలారం గ్రామానికి సరస్వతి (48)రోడ్డు దాటుతున్న క్రమంలో అతివేగంగా వచ్చిన ఓ గుర్తు తెలియని వాహనం ఆమెను వెనక నుంచి బలంగా ఢీకొట్టింది.దింతో సరస్వతి రెండు కాళ్లు నుజ్జు నుజ్జు కాగా..తలకు బలమైన గాయమవడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది.ప్రమాదానికి కారణమైన వాహనం ఆపకుండా డ్రైవర్ అక్కడ నుంచి పరారయ్యాడు.సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై ముత్యం రాజేందర్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మృతురాలు కుమార్తె గడి దాసు నవ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని,పరారైన వాహనం జాడను కనుగొనేందుకు పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు.

# గోదావరిలో పడి బాలుడి మృతి

**బహిర్భూమికి వెళ్లిన సమయంలో ప్రమాదం.. పూసూరులో విషాదం..**



కాకతీయ, ఏటూరునాగారం : గోదావరిలో పడి ఆరేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన ములుగు జిల్లా వాజేడు మండలం పూసూరు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కుమ్మరి హేశ్వంత్ (6) బహిర్భూమికి వెళ్లేందుకు మరో బాలుడితో కలిసి గోదావరి ఒడ్డుకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నదిలో జారిపడి నీట మునిగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అక్కడికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో బాలుడి మృతదేహాన్ని వెలికితీశారు. హేశ్వంత్ పూసూరు గ్రామంలోని పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. చిన్నారి మృతితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆరేళ్ల బాలుడు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటనపై వాజేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పల్లె పండుగలతో ఆదర్శంగా నిలవాలి

**బీఆర్ఎస్ మహబూబాబాద్ డివిజన్ యువజన ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి**



కాకతీయ, ఇనుగుర్తి : పల్లెల్లో సంప్రదాయబద్ధంగా నిర్వహించే పండుగలను ఆచరిస్తూ, ఆటల్లో ఆరోగ్య నియమాలు పాటించి ముందు తరాలకు ఆదర్శంగా నిలవాలని బీఆర్ఎస్ మహబూబాబాద్ డివిజన్ యువజన ఉపాధ్యక్షుడు బండారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ఇనుగుర్తి మండలం చిన్ననాగారం ఒకటో వార్డులో బొడ్డెమ్మ పండుగ సందర్భంగా మహిళలకు రూ.15 వేల విలువైన చీరలు, కోలలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఆచార సంప్రదాయాలను ప్రతిబింబించేలా మహిళలు పండుగలను నిర్వహించడం అభినందనీయమన్నారు. పండుగల ద్వారా గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలని సూచించారు. చీరలు పంపిణీ చేసిన శ్రీనివాస్‌రెడ్డికి మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## టీపీటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

కాకతీయ, నెల్లికుదురు : తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ నెల్లికుదురు మండల శాఖ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షులు యెడెల్లి యాకయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో టి పి టి ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్ధోజు కవిత, జిల్లా ప్రధాన కార్యదర్శి పి .విష్ణువర్ధన్ రెడ్డి ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి కె . జనార్దన్ ,ఎన్నికల పరిశీలకులుగా రవీందర్ రెడ్డి జిల్లా కార్యదర్శి లు హాజరై ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల అధ్యక్షులుగా యెడెల్లి యాకయ్య ,మండల ప్రధాన కార్యదర్శిగా సంగ శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కే .నవీన్, నిక్కత్ న్నిసా బేగం, హరినాథ్ బాబు, కార్యదర్శులుగా ఎం. మధుసూదన్ ,కే .సంపత్ రెడ్డి ,ఈ .మధుబాబు, ఎస్. ప్రవీణ్ కుమార్ జిల్లా కౌన్సిలర్స్ గా కే .వెంకటేశ్వర్లు , బీ .బిక్షపతి ,కే. పద్మావతి ఆడిట్ కమిటీ కన్వీనర్ గా బి. శ్రీనివాస్, సభ్యులుగా ఈ .కరుణాకర్ ,బి. సంపత్ అకాడమిక్ సెల్ కన్వీనర్ గా ఎం.డి .సలీం ,సభ్యులుగా శ్రీనివాస చారి, జి. మధు, జీవోల కమిటీ కన్వీనర్ గా కే. వెంకటేశం, పి .రమేష్ లు ఏక గ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కే .జనార్ధన్ పరిశీలకులు రవీందర్ రెడ్డిలు ప్రకటించారు.

# ప్రేమ పెళ్లిలో శ్రీదేవి విజయం

**4 రోజుల యువతి దీక్ష పోరాటానికి తెర**

**దిగి వచ్చిన వర్ధన్నపేట మునిసిపల్ చైర్మన్ కుటుంబ సభ్యులు**

**మీడియా, సామాజిక మాధ్యమాల్లో విస్తృత చర్చతో ఒత్తిడి**

**సామాజిక కార్యకర్తల చొరవతో ఇరు కుటుంబాల మధ్య సయోధ్య**

**చివరకు అందరి సమక్షంలో శ్రీదేవిని వివాహమాడిన శ్రీకాంత్**



కాకతీయ, వర్ధన్నపేట : తాను ప్రేమించిన పాలకుర్తి శ్రీకాంత్‌తోనే వివాహం జరిపించాలని పట్టువిడవకుండా 4 రోజులుగా పోరాటం చేసిన దళిత యువతి తుమ్మల శ్రీదేవి చివరకు తన లక్ష్యాన్ని సాధించింది. ప్రజాసంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సబ్బండ వర్గాలు ఆమెకు అండగా నిలవడంతోపాటు మీడియా కథనాలు, సామాజిక మాధ్యమాల్లో విస్తృత చర్చ జరగడంతో ఇరు కుటుంబాలపై ఒత్తిడి పెరిగింది. చివరకు ఇరు కుటుంబాల మధ్య సయోధ్య కుదిరి ప్రేమికుల వివాహానికి మార్గం సుగమమైంది. శ్రీకాంత్ తనను వివాహం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ శ్రీదేవి కుటుంబ సభ్యులతో కలిసి చైర్మన్ కుటుంబం ఇంటి ఎదుట 4 రోజులుగా దీక్ష కొనసాగించింది. రాత్రింబవళ్లు అక్కడే ఉంటూ తన డిమాండ్‌పై వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేసింది. పలువురు నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు దీక్షా స్థలానికి చేరుకుని సంఘీభావం ప్రకటించారు.

### రాజకీయంగా మారిన వ్యవహారం

వ్యవహారం రోజురోజుకూ తీవ్రతరం కావడంతో అధికార కాంగ్రెస్‌లోనూ చర్చకు దారితీసింది. ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం శ్రీదేవికి మద్దతు ప్రకటించారు. దీంతో ఈ అంశం కుటుంబ వ్యవహారం నుంచి సామాజిక, రాజకీయ అంశంగా మారింది. మీడియా కథనాలు, సామాజిక మాధ్యమాల చర్చలతో రాష్ట్రస్థాయిలోనూ దృష్టిని ఆకర్షించింది. పరిస్థితిని చక్కదిద్దేందుకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు జోక్యం చేసుకున్నారు. టీపీసీసీ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావుతో కలిసి ఇరు కుటుంబాలతో చర్చలు జరిపారు. పెద్దల సమక్షంలో చర్చలు జరిపి ఇరు కుటుంబాల అంగీకారంతో వివాహానికి మార్గం సుగమం చేశారు. ఈ మేరకు అంగీకార పత్రం కూడా రాసుకున్నట్లు సమాచారం.

### అందరి సమక్షంలో శ్రీదేవి మెడలో పసుపుతాడు

చర్చలు సఫలం కావడంతో చైర్మన్ కుటుంబం వివాహానికి అంగీకరించింది. శ్రీకాంత్, తుమ్మల శ్రీదేవి ఇంటి వద్ద పరస్పరం దండలు మార్చుకున్నారు. అనంతరం పసుపుతాడు కట్టడంతో 4 రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. త్వరలో పెద్దల సమక్షంలో శాస్త్రోక్తంగా వివాహం నిర్వహించి, అనంతరం రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎండా, వానా లెక్కచేయకుండా 4 రోజులపాటు దీక్ష కొనసాగించిన శ్రీదేవి చివరకు తాను కోరుకున్న వ్యక్తితో వివాహానికి అంగీకారం సాధించడంతో ఆనందం వ్యక్తం చేసింది. తన జీవిత భాగస్వామిని తానే ఎంచుకునే హక్కు కోసం సాగిన పోరాటానికి ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు, మీడియా, సామాజిక మాధ్యమాల నుంచి లభించిన మద్దతు కీలకంగా మారింది. ఇరు కుటుంబాలు వివాహానికి అంగీకరించడంతో ఈ వ్యవహారం సుఖాంతమైంది.

## లారీ బీభత్సం.. డీసీఎం, కారును ఢీకొట్టిన లారీ

**సీఆర్పీఎఫ్ జవాన్ మృతి.. మరో ఐదుగురికి తీవ్ర గాయాలు**

కాకతీయ, ఏటూరునాగారం : ములుగు జిల్లా గోవిందరావుపేట మండల పరిధిలో గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పస్ర చెక్‌పోస్ట్ సమీపంలోని జాతీయ రహదారి–163పై సీఆర్పీఎఫ్ జవాన్లు ప్రయాణిస్తున్న డీసీఎం వాహనాన్ని లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 39వ బెటాలియన్‌కు చెందిన సీఆర్పీఎఫ్ జవాన్ ముగరం రమాకాంత్ (35) అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు జవాన్లు గిరీష్‌కుమార్, ప్రేమ్‌ప్రకాశ్, రంజాన్‌ప్రసాద్ (50) తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. ఏటూరునాగారం నుంచి ములుగు వైపు నలుగురు సీఆర్పీఎఫ్ జవాన్లు డీసీఎం వాహనంలో వెళ్తుండగా, పస్ర వైపు నుంచి ఏటూరునాగారం వైపు వస్తున్న లారీ పస్ర చెక్‌పోస్ట్ సమీపంలో డీసీఎంను ఢీకొట్టింది. ప్రమాద ధాటికి డీసీఎం అదుపుతప్పి రహదారి పక్కనున్న అటవీ ప్రాంతంలోకి దూసుకెళ్లింది. అదే సమయంలో లారీ మరో ప్రైవేట్ కారును కూడా ఢీకొనడంతో కారు లారీ కిందకు దూసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న తాడ్వాయి మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ ఉద్యోగి పి.రమేశ్, గోవిందరావుపేట మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో పనిచేస్తున్న సఫ్జియాకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ములుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.





## పేద విద్యార్థులకు పబ్లిక్ స్కూల్ వరం

**ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**

కాకతీయ,ఆత్మకూరు : పేద మధ్యతరగతి విద్యార్థులకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఒక వరం అని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూరు మండలం పెద్దాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ పనులకు అయన శంకుస్థాపన చేసి మాట్లాడారు పేద మధ్యతరగతి పిల్లకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ కృషి చేస్తుందని అన్నారు. కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్యను విద్యార్థులకు ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ వ్యవస్థను ప్రజా ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. కార్యక్రమంలో పెద్దాపూర్ సర్పంచ్ ఎలుకటి రవి,కాంగ్రెస్ జిల్లా నాయకులు కమలాపురం రమేష్,మండల అధ్యక్షుడు రేవూరి జెలందెర్ రెడ్డి,పరికిరాల వాసు,అక్కంపేట సర్పంచ్ ముద్దం సాంబయ్య,చౌళ్లపల్లి మాజీ సర్పంచ్ కంచె రవి కుమార్,రేవూరి జైపాల్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు...

## సైబర్ నేరాల కట్టడికి చర్యలు

**9 నెలల్లో 3,952 ఫిర్యాదులు.. 174 మంది నిందితుల అరెస్ట్**

**వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత**



కాకతీయ, వరంగల్ బ్యూరో: సైబర్ నేరాల నియంత్రణ, బాధితులకు సత్వర సహాయం, మోసపోయిన నగదు పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత తెలిపారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు ఎన్‌సీఆర్‌పీ ద్వారా 3,952 ఫిర్యాదులు అందగా 1,155 పరిష్కరించారు. 105 కేసులను ఛేదించి 174 మంది నిందితులను అరెస్ట్ చేశారు. సైబర్ మోసాల్లో బాధితులు రూ.20.66 కోట్లు నష్టపోగా రూ.5.23 కోట్లను పునరుద్ధరించారు. సమన్వయ వ్యవస్థ ద్వారా వచ్చిన 983 అభ్యర్థనల్లో 866 పరిష్కరించగా, జీఆర్ఎం, ఎంఆర్ఎం ద్వారా వచ్చిన ఫిర్యాదుల్లోనూ చర్యలు తీసుకున్నారు. జూన్, జూలై, ఆగస్టులో 286 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సెప్టెంబర్‌లో 483 ఫిర్యాదులు, 10 ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా 34 మంది అరెస్ట్ అయ్యారు. రూ.49.56 లక్షలు బాధితులకు తిరిగి అందించారు. మోసానికి గురైన వెంటనే 1930కు ఫోన్ చేసి ఎన్‌సీఆర్‌పీలో ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు.

## బాధిత కుటుంబాలకు ఝాన్సీ రెడ్డి భరోసా

**మృతుల కుటుంబాలకు అండగా ఉంటా**

**కుటుంబ పెద్దలను కోల్పోవడం బాధాకరం**

**టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి**



కాకతీయ, రాయపర్తి : ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలకు టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి భరోసా కల్పించారు. గురువారం రాయపర్తి మండలంలో పర్యటించిన ఆమె కాట్రపల్లి గ్రామానికి చెందిన కుందూరు వెంకట్‌రెడ్డి కుటుంబాన్ని, అనంతరం కృష్ణాపురం గ్రామానికి చెందిన ఎస్సై వీరన్న కుటుంబాన్ని పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ.. రెండు కుటుంబాలు ఇంటి యజమానులను కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, ఎలాంటి కష్టం వచ్చినా పార్టీ పరంగా, వ్యక్తిగతంగా ఇరు కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, మాజీ బ్లాక్ అధ్యక్షుడు హామ్యా నాయక్, వివిధ గ్రామాల సర్పంచులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# పొలాల బాట పట్టండి మంత్రిగారూ!

**రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ హామీ ఏమైంది?**

**ఎరువుల కోసం క్యూలైన్లలో నిలబడే దుస్థితి వచ్చింది**

**బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య**



కాకతీయ, చిగురుమామిడి : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక కనీసం 5 గంటలు కూడా సక్రమంగా సరఫరా చేయడం లేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే ఒడితల సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు బుధవారం చిగురుమామిడి మండల కేంద్రంలో నిర్వహించిన ధర్నాలో వైస్ ఎంపీపీ బేతి రాజురెడ్డి పాల్గొన్నారు. అంజయ్య మాట్లాడుతూ.. కేసీఆర్ చెప్పినట్లుగానే రైతులు డీఏపీ, యూరియా తదితర ఎరువుల కోసం క్యూలైన్లలో నిలబడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. గత 10 ఏళ్లలో ఒక్క గంట కూడా విద్యుత్ కోత లేకుండా సరఫరా చేశామని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని తెలిసినా విద్యుత్ ఉత్పత్తికి సరిపడా నిల్వలు సమకూర్చకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. పల్లెబాట పేరుతో కాకుండా పొలాల్లోకి వెళ్లి రైతుల సమస్యలు తెలుసుకోవాలని మంత్రులను కోరారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు రైతులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఓంటల కిషన్‌రెడ్డి, పెసర రాజేశం, సన్నిల వెంకటేశం, బెజ్జంకి రాంబాబు, సర్వర్ పాషా, శ్రీరామోజు కృష్ణమాచారి, గీట్ల తిరుపతిరెడ్డి, యల్ల జనార్దన్‌రెడ్డి, ముసుకుల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బంగారం చోరీ కేసులో వ్యక్తి అరెస్టు



కాకతీయ, పెద్దవంగర : బంగారం చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తొర్రూరు డివిజన్ సీఐ గణేష్ తెలిపారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పెద్దవంగర మండలం అవుతాపురం గ్రామానికి చెందిన గద్దల పద్మ బుధవారం తన ఇద్దరు కుమార్తెలను ఇంటి వద్ద ఉంచి ఊరికి వెళ్లారు. రాత్రి ఇద్దరు కుమార్తెలు బంధువుల ఇంట్లో నిద్రించేందుకు వెళ్లారు. గురువారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండటంతోపాటు ఇంట్లోని 8 తులాల బంగారం అపహరణకు గురైనట్లు గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు గురువారం నిందితుడిని అరెస్టు చేశారు. చోరీకి గురైన బంగారాన్ని రికవరీ చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ ప్రమోద్‌కుమార్, ఏఎస్ఐ రాజారాం, కానిస్టేబుళ్లు ఈర్య నాయక్, మహేందర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఇనగాల పరామర్శ



కాకతీయ, ఆత్మకూరు : ఆత్మకూరు గ్రామంలో ఇటీవల మృతిచెందిన పలువురి కుటుంబాలను హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి గురువారం పరామర్శించారు. గ్రామానికి చెందిన పొదిల సమ్మక్క ఇటీవల మృతిచెందగా, ఆమె నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం న్యాయవాది తనుగుల సన్నీ తండ్రి తనుగుల సాంబయ్య మృతిచెందిన విషయం తెలుసుకుని వారి ఇంటికి వెళ్లారు. సాంబయ్య పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పర్వతగిరి రాజు మహేశ్వరి, రేవూరి జైపాల్‌రెడ్డి, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## వన్యప్రాణుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకం

**20,050 హెక్టార్ల అటవీ భూమిని తిరిగి స్వాధీనం**

**ఏటూరునాగారం ఎఫ్ఆర్వో రెహమాన్ పిలుపు**



కాకతీయ, ఏటూరునాగారం : అడవులు, వన్యప్రాణులను కాపాడుకోవడంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా, మేధావులు సమష్టిగా భాగస్వాములు కావాలని ఏటూరునాగారం ఎఫ్ఆర్వో రెహమాన్ పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించేందుకు అడవులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ములుగు జిల్లాలో సుమారు 87 శాతం అటవీ ప్రాంతం ఉందని, అడవుల కారణంగానే ప్రకృతి సమతుల్యత, వర్షపాతం, సహజ సౌందర్యం కొనసాగుతున్నాయని తెలిపారు. అక్రమ ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టి, సుమారు 20,050 హెక్టార్ల నష్టపోయిన అటవీ భూమిని తిరిగి అటవీశాఖ ఆధీనంలోకి తీసుకునే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. మరో 650 హెక్టార్లలో అటవీకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. వేటగాళ్లకు అవగాహన కల్పించి వారిని వన్యప్రాణుల రక్షకులుగా మార్చుతున్నామని, గతేడాదితో పోలిస్తే వేట పరికరాలు గణనీయంగా తగ్గాయన్నారు. ప్లాస్టిక్ నిర్మూలన, నీటి వనరుల సంరక్షణ, వన్యప్రాణుల రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రజల సహకారంతో అడవులను ముక్కలు కాకుండా కాపాడుకుందామని రెహమాన్ కోరారు.

# కోఆప్షన్ ఎన్నికలకు ఎందుకింత భయం?

**బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఎక్కువగా ఉన్నందుకే వాయిదా**
**ఎన్నికై ఏడాది అవుతున్నా కోఆప్షన్ సభ్యుల ఊసేది?**
**కేసీఆర్ భూముల పేరుతో ప్రజల దృష్టి మళ్లించేందుకు కాంగ్రెస్ యత్నం**
**రైతులు రేవంత్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారు**
**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధ్వజం**



కాకతీయ, తొర్రూరు : మున్సిపాలిటీల్లో కోఆప్షన్ సభ్యుల ఎన్నికలను వెంటనే నిర్వహించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఎక్కువగా ఉన్నారనే భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం కోఆప్షన్ ఎన్నికలను వాయిదా వేస్తోందని ఆరోపించారు. ఎన్నికై ఏడాది కావస్తున్నా కోఆప్షన్ సభ్యుల ఎన్నికలు నిర్వహించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన కౌన్సిలర్ల హక్కులను ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. తొర్రూరులోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం కౌన్సిలర్లు, పార్టీ సీనియర్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడారు. ప్రతి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఎక్కువగా ఉన్నందున కోఆప్షన్ పదవులు తమ పార్టీకి దక్కుతాయనే భయంతోనే ప్రభుత్వం ఎన్నికలను ముందుకు సాగనివ్వడం లేదని అన్నారు. తొర్రూరు మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు చైర్మన్ పీఠం దక్కే అవకాశం ఉందనే కారణంతోనే ఎన్నికల ప్రక్రియను అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

**భూకబ్జాల పేరుతో కొత్త నాటకం**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భూముల అంశాన్ని తెరపైకి తెచ్చి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోందని ఎర్రబెల్లి విమర్శించారు. కేసీఆర్ భూకబ్జాల పేరుతో కొత్త నాటకానికి తెరలేపుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన అన్నదమ్ములకు వందల కోట్ల ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలకు వివరించాలని ప్రశ్నించారు. రైతులు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఎర్రబెల్లి అన్నారు. రైతుబంధు, యూరియా కొరత, విద్యుత్ సరఫరా, పంట రుణమాఫీ తదితర అంశాల్లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రైతు బీమా ప్రీమియం చెల్లింపునకు గడువు ముగిసినా ప్రభుత్వం పట్టించుకోలేదని, సాగునీరు అందించడంలోనూ నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు.

**సంక్షేమ పథకాలు కొనసాగించాలి**

కేసీఆర్ హయాంలో రైతులు, మహిళల సంక్షేమం కోసం అమలు చేసిన పథకాలను కొనసాగించాలని ఎర్రబెల్లి డిమాండ్ చేశారు. కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించడంతోపాటు కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం ఇస్తామన్న హామీని అమలు చేయాలని కోరారు. సంక్షేమ పథకాలను నిలిపివేస్తే మహిళల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మున్సిపాలిటీల్లో కోఆప్షన్ ఎన్నికలను ఇకనైనా వెంటనే నిర్వహించి, ఎన్నికైన కౌన్సిలర్లకు వారి హక్కులు కల్పించాలని ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికల ప్రక్రియను మరింత ఆలస్యం చేస్తే బీఆర్ఎస్ తరఫున ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పసుమర్తి సీతారాములు, మంగళపల్లి శ్రీనివాస్, రామిని శ్రీనివాస్, నల్లమాస ప్రమోద్‌కుమార్, హనుమండ్ల ప్రదీప్‌రెడ్డి, కుర్ర శ్రీనివాస్, మనిరాజు, బీఆర్ఎస్ కౌన్సిలర్లు భూసాని జయమ్మ, ధరావత్ పద్మ, కిన్నెర కవిత, తూర్పటి రవి, జంపా తదితరులు పాల్గొన్నారు.

# కొత్త రేషన్ కార్డులతో పేదలకు భరోసా

**పేదవాడి ఆకలి తీరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం**
**పరకాల 19వ వార్డు కౌన్సిలర్ కొయ్యడ శ్రీనివాస్**



కాకతీయ, పరకాల : పేదవాడి ఆకలి తీర్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం అందిస్తోందని 19వ వార్డు కౌన్సిలర్, మాజీ పరకాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ అన్నారు. పరకాల పట్టణంలోని 19వ వార్డులో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కొత్త రేషన్ కార్డుల పంపిణీ, రేషన్ కార్డుల డిజిటల్ కార్డుల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో లక్షలాది నూతన రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు పేదలకు సన్నబియ్యం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్ల పాలనలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని, కార్డుల్లో పిల్లల పేర్లను కూడా నమోదు చేయలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదలకు కూడు, గుడ్డ, నీడ కల్పించడమే లక్ష్యంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు సొంతింటి కల నెరవేర్చడంతో పాటు సన్నబియ్యంతో వారి కడుపు నింపుతున్నారని అన్నారు. కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ బండి శ్రీధర్, సురేష్, షఫీ, రాహుల్, ప్రజలు పాల్గొన్నారు.

# ధైర్యంగా ఉండు..నేనున్నా!

**అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులకు ఎర్రబెల్లి అభయం**



కాకతీయ,రాయపర్తి : ఏమి అధైర్య పడొద్దు.. ధైర్యంగా ఉండండి నేనున్నాను అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులకు ధైర్యం చెప్పారు.గురువారం ఆయన మండలంలో విస్తృతంగా పర్యటించి కార్యకర్తలు,నాయకుల కుటుంబాలను ఆప్యాయంగా పలకరించారు.మండల కేంద్రానికి చెందిన ఇజ్జగిరి సమ్మయ్య,దురిశెట్టి కొమురయ్య అనారోగ్యానికి గురై ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా వారి నివాసానికి వెళ్లి ఎర్రబెల్లి పరామర్శించారు.బాధితుడి ఆరోగ్య పరిస్థితిని,ప్రస్తుతం అందుకున్న వైద్య వివరాలను అడిగి తెలుసుకున్నారు.ధైర్యంగా ఉండాలని,త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.వైద్య చికిత్స నిమిత్తం ఎలాంటి సహాయం కావాలన్నా పూర్తిస్థాయిలో అండగా ఉంటానని ఎర్రబెల్లి హామీ ఇచ్చారు.అనంతరం రాయపర్తి,మహబూబ్ నగర్,బంధనపల్లి గ్రామాలలో మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపి జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పిటిసి రంగు కుమార్,మాజీ సర్పంచ్ గారె నర్సయ్య,పోగులకొండ వేణు,చందు రాము పాల్గొన్నారు.

# వాహనాల తనిఖీ..115 డ్రంక్ డ్రైవ్ కేసులు

**42 వాహనాలు సీజ్.. రూ.1.16 లక్షల జరిమానాల వసూలు**
**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు :సీపీ గౌష్ ఆలం**



కాకతీయ, కరీంనగర్: శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, రహదారి ప్రమాదాల నివారణే లక్ష్యంగా కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో బుధవారం రాత్రి 9 గంటల నుంచి అర్ధరాత్రి వరకు విస్తృత నాకాబందీ నిర్వహించారు. టౌన్, రూరల్, హుజూరాబాద్ డివిజన్లలో ప్రధాన కూడళ్లు, జాతీయ, అంతర్గత రహదారులపై మొత్తం 4,265 వాహనాలను తనిఖీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 115 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని 42 వాహనాలను సీజ్ చేశారు. 133 స్పాట్ చలాన్ల ద్వారా రూ.66,135, 126 పెండింగ్ చలాన్ల ద్వారా రూ.50,300 వసూలు చేశారు. 21 ఈ–చలాన్లు, 12 ఈ–పెట్టీ కేసులు నమోదు చేశారు. 81 మంది అనుమానితులను వేలిముద్రల ఆధారంగా తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై, మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు తప్పవని సీపీ గౌష్ ఆలం హెచ్చరించారు. వాహన ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవడంతో పాటు హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించి సురక్షితంగా ప్రయాణించాలని సూచించారు. ఆకస్మిక నాకాబందీ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

# మాజీ కార్పొరేటర్ భర్తపై కేసు

**బాధితుడిపై దాడి చేశారని ఫిర్యాదు : గీసుగొండ సీఐ డి. విశ్వేశ్వర్**

కాకతీయ, గీసుగొండ: పంచాయతీకి పిలిచి బెదిరించి రూ.లక్ష తీసుకోవడంతో పాటు దాడికి పాల్పడ్డారని చీర్ల ఉమారెడ్డి (59) ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ కార్పొరేటర్ భర్త సుంకరి శివతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు గీసుగొండ సీఐ డి. విశ్వేశ్వర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన ఉమారెడ్డి, ఆయన తమ్ముడు చీర్ల మల్లారెడ్డి మధ్య కోర్టు కేసు ఖర్చుల విషయంలో వివాదం ఏర్పడింది. ఈ నేపథ్యంలో గురువారం సుంకరి శివ తన ఇంటి వద్ద పంచాయతీ నిర్వహించి, కేసుకు సంబంధించిన డబ్బులు మల్లారెడ్డికి ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఉమారెడ్డి నిరాకరించడంతో బెదిరించి రూ.లక్ష తీసుకున్నారని, అనంతరం ప్లాస్టిక్ కుర్చీతో ముఖంపై, టీపాయ్‌తో కుడికాలిపై కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు. మల్లారెడ్డి, ఆయన కుమారుడు చీర్ల రాజిరెడ్డి దూషిస్తూ ఛాతిపై చేతులతో కొట్టి బెదిరించినట్లు ఫిర్యాదులో ఉందన్నారు. ఉమారెడ్డి ఫిర్యాదు మేరకు సుంకరి శివ, చీర్ల మల్లారెడ్డి, చీర్ల రాజిరెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# ప్రజల నీటి అవసరాలకు తక్షణ పరిష్కారం

**శనిగరం సర్పంచ్ లింగంపల్లి లక్ష్మయ్య**



కాకతీయ, కోహెడ : ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని శనిగరం సర్పంచ్ లింగంపల్లి లక్ష్మయ్య తెలిపారు. మండలంలోని శనిగరం గ్రామం 13వ వార్డు మల్కాపీరుల రోడ్డు కొత్రసులో పాత మోటారు పనిచేయక నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో కొత్త సీఆర్ఐ సింగిల్ మోటారును ఏర్పాటు చేశారు. సమస్యపై వెంటనే స్పందించి మోటారు ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పేరుకా బుచ్చయ్య, వార్డు సభ్యులు జడగల సతీష్, గొంటి లక్ష్మయ్య, కాశవేణి శ్రీకాంత్, లింగంపల్లి అశోక్, మిషన్ భగీరథ ఇంట్రా సిబ్బంది జడగల లక్ష్మయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎండీ రాజ్ మహమ్మద్, గ్రామస్తులు పాల్గొన్నారు. సమస్యను పరిష్కరించిన సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఓటరు జాబితా సవరణను వేగిరం చేయాలి

**హనుమకొండ అదనపు కలెక్టర్ ఎన్. రవి ఆదేశం**

కాకతీయ, హనుమకొండ : ఓటర్ల జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ అదనపు కలెక్టర్ ఎన్. రవి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫారం–6, 7, 8లకు సంబంధించి 14,856 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రకారం పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల్లో 4,07,317 మంది ఓటర్లు ఉండగా, ఆధార పత్రాలతో విచారణకు హాజరు కావాలని 1,32,062 మందికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. 3,83,165 మంది వివరాలను తుది ప్రచురణకు సిద్ధం చేశామని, విచారణలో 689 మందిని అనర్హులుగా గుర్తించామని పేర్కొన్నారు. మిగిలిన 23,463 దరఖాస్తులను నవంబర్ 5లోపు పరిష్కరిస్తామన్నారు. పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి 11,731 ఫారం–18 దరఖాస్తులు అందగా క్షేత్రస్థాయి పరిశీలన కొనసాగుతోందన్నారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు అయ్యేలా రాజకీయ పార్టీలు విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో బీజేపీ రావు అమరేందర్‌రెడ్డి, సీపీఐ(ఎం) జి. ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ బి. ప్రవీణ్‌కుమార్, టీడీపీ కె. శ్యామ్‌సుందర్, ఎంఐఎం సయ్యద్ ఫైజుల్లా పాల్గొన్నారు.

# మిషన్ శక్తి కింద సఖి కేంద్రంలో 13 పోస్టులు

కాకతీయ,జనగామ : మిషన్ శక్తి పథకం కింద జనగామలోని సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో 13 పోస్టులను అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. భర్తీ చేయనున్న పోస్టుల్లో సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఒకటి, సైకో సోషల్ కౌన్సిలర్ ఒకటి, కేస్ వర్కర్లు రెండు, పారా లీగల్ పర్సనల్/లాయర్ ఒకటి, పారా మెడికల్ పర్సనల్ ఒకటి, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన ఆఫీస్ అసిస్టెంట్ ఒకటి, మల్టీ పర్పస్ స్టాఫ్/కుక్ మూడు, సెక్యూరిటీ గార్డ్/నైట్ గార్డ్ మూడు పోస్టులు ఉన్నాయని తెలిపారు. అభ్యర్థుల వయసు 2026 అక్టోబర్ 1 నాటికి 21 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండాలని సూచించారు. ఎంపిక ప్రక్రియలో నెగెటివ్ మార్కింగ్‌తో రాత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 11న ఆదివారం ఉదయం 10 గంటలకు రాత పరీక్ష నిర్వహించడంతోపాటు అదే రోజు మౌఖిక పరీక్ష నిర్వహించి ఫలితాలను ప్రకటించనున్నట్లు వెల్లడించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ అసలు ధ్రువపత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు. నిర్దేశిత దరఖాస్తు ఫారంలో ఈ నెల 6 నుంచి 10వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట వరకు జనగామ ఐడీఓసీలోని కలెక్టరేట్ ఇన్‌వార్డ్ సెక్షన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పోస్టులవారీగా విద్యార్హతలు, అనుభవం, రిజర్వేషన్, సిలబస్, దరఖాస్తు విధానం, ఇతర నిబంధనలకు సంబంధించిన పూర్తి వివరాలను జనగామ జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో, కలెక్టరేట్ నోటీసు బోర్డులో అందుబాటులో ఉన్న వివరణాత్మక నోటిఫికేషన్‌లో పరిశీలించవచ్చని తెలిపారు. సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో పనిచేస్తున్న వారు కూడా ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

# గురుకులంలో 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్'

కాకతీయ, చేర్యాల : కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చేర్యాలలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో గురువారం 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు హర్యానా రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, జీవన విధానాన్ని తమ ప్రదర్శనల ద్వారా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పోలోజు నరసింహాచారి మాట్లాడుతూ.. భిన్న భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలకు భారతదేశం నిలయమైనప్పటికీ 'భిన్నత్వంలో ఏకత్వం' దేశ ప్రత్యేకత అని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# లక్ష్మీపురం మార్కెట్‌లో బకాయి బాగోతం!

**నాలుగు షాపులపై కోర్టు వివాదం.. అయినా కొనసాగుతున్న వ్యాపారం**
**రూ.39.82 లక్షల బకాయిలు..ఆరేళ్లుగా కొత్త టెండర్లు లేవు..**
**బకాయిదారులకు ఆక్షన్ మినహాయింపు ఎందుకు?**
**మార్కెట్ అధికారుల తీరుపై రైతుల ప్రశ్నలు**





కాకతీయ, వరంగల్ ప్రతినిధి : షాపులు దక్కించుకునేందుకు పోటాపోటీగా వేలం.. ఆ తర్వాత కిరాయిల చెల్లింపులో చేతులెత్తేయడం.. బకాయిలు పేరుకుపోయినా చర్యలు మాత్రం కొందరిపైనే! వరంగల్ ఏనుమాముల పరిధిలోని లక్ష్మీపురం మోడల్ కూరగాయల మార్కెట్‌లో కమర్షియల్ షాపుల బకాయిల వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మొత్తం 30 షాపుల్లో ఒకదాన్ని మార్కెట్ కార్యాలయానికి కేటాయించగా, మిగిలిన 29 షాపుల నుంచి రావాల్సిన బకాయిలు రూ.39,82,187కు చేరినట్లు మార్కెట్ లెక్కలు చెబుతున్నాయి. మరోవైపు బకాయిల వసూళ్లలోనూ ఒకే విధానం పాటిస్తున్నారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2021లో అప్పటి మార్కెట్ పాలకవర్గం 29 కమర్షియల్ షాపులకు బహిరంగ టెండర్లు నిర్వహించింది. షాపుల పరిమాణాన్ని బట్టి 7 షాపులకు నెలకు రూ.3,850, 22 షాపులకు రూ.4,200 కనీస కిరాయిగా నిర్ణయించారు. అయితే టెండర్‌లో పోటీ పెరగడంతో కొందరు వ్యాపారులు కనీస ధర కంటే ఆరు రెట్లకు పైగా చెల్లించేందుకు ముందుకొచ్చారు. కొన్ని షాపులకు నెలకు రూ.27 వేల వరకు కిరాయి కోట్ చేసి దక్కించుకున్నారు. ప్రతి షాపుదారుడి నుంచి రూ.50 వేల చొప్పున డీడీ రూపంలో ముందస్తు మొత్తాన్ని కూడా వసూలు చేసినట్లు సమాచారం.

**రెండు నెలలకే బకాయిల పర్వం**

షాపులు దక్కించుకున్న వ్యాపారులు మొదటి ఒకటి, రెండు నెలలు కిరాయిలు చెల్లించిన తర్వాత బకాయిలు పేరుకుపోయినట్లు మార్కెట్ వర్గాల సమాచారం. అధికారులు పలుమార్లు ఒత్తిడి తెచ్చి కొంత మొత్తం వసూలు చేసినప్పటికీ భారీగా బకాయిలు మిగిలిపోయినట్లు తెలుస్తోంది. 2023లో కిరాయి చెల్లించని ఏడుగురు షాపుదారులను తొలగించి, ఆయా షాపులకు మళ్లీ టెండర్లు నిర్వహించినట్లు సమాచారం.
అయితే అందరిపైనా ఒకే రకమైన చర్యలు తీసుకున్నారా? లేక కొందరికి మాత్రమే మినహాయింపులు లభించాయా? అన్నదే ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. షాపు నంబర్లు 6, 7, 15, 18కు సంబంధించిన నలుగురు వ్యాపారులు కిరాయి చెల్లించలేమంటూ కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. వీరి వద్ద నుంచి రావాల్సిన బకాయిలే రూ.26,67,600గా ఉన్నట్లు మార్కెట్ రికార్డులు పేర్కొంటున్నాయి. కోర్టు వివాదం నేపథ్యంలో ఆయా షాపులపై మార్కెట్ యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకుంది? అన్నది ప్రశ్నగా మారింది. నిబంధనల ప్రకారం కోర్టు వివాదం కొనసాగుతున్న సమయంలో షాపుల నిర్వహణపై స్పష్టమైన చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ.. అక్కడ వ్యాపారం కొనసాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

**తొమ్మిది మందికి ఎందుకు మినహాయింపు?**

మిగిలిన 25 షాపుల్లో 8, 11, 13, 19, 20, 21, 26 నంబర్లతో ఉన్న ఏడు షాపులను బకాయిల కారణంగా ఓపెన్ ఆక్షన్‌కు పంపినట్లు సమాచారం. వీటి నుంచి రావాల్సిన బకాయి రూ.4,03,540గా ఉంది. మరో 18 షాపుల నుంచి రూ.9,11,047 బకాయి రావాల్సి ఉంది. ఇందులో షాపు నంబర్లు 4, 9, 12, 17, 24, 27, 28, 29, 30కు చెందిన తొమ్మిది మంది వ్యాపారుల వద్ద రూ.50 వేల నుంచి రూ.98 వేల వరకు బకాయిలు ఉన్నట్లు మార్కెట్ లెక్కలు చెబుతున్నాయి. అయినప్పటికీ వీరిని ఓపెన్ ఆక్షన్ జాబితాలో ఎందుకు చేర్చలేదన్నది ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది. బకాయి ఉన్న ఏడుగురిని వేలానికి పంపి.. అంతకంటే ఎక్కువ మొత్తంలో బకాయి ఉన్న మరికొందరిని ఎందుకు మినహాయించారన్న దానిపై మార్కెట్ అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. 2021లో కమర్షియల్ షాపులకు టెండర్లు నిర్వహించిన తర్వాత 2026 వరకు కొత్తగా అన్ని షాపులకు టెండర్లు నిర్వహించకపోవడంపైనా రైతులు, వ్యాపార వర్గాలు ప్రశ్నలు సంధిస్తున్నాయి. కిరాయిలు సక్రమంగా రాకపోయినా షాపులను కొనసాగించడం వెనుక కారణమేంటి? బకాయిల వసూళ్లకు మార్కెట్ యంత్రాంగం తీసుకున్న చర్యలేంటి? ఒకే విధమైన బకాయిదారులపై ఒకే రకమైన చర్యలు ఎందుకు లేవు? అన్న ప్రశ్నలకు సమాధానం కావాలని రైతులు కోరుతున్నారు. రూ.39.82 లక్షల బకాయిల వ్యవహారంలో షాపుల వారీగా వసూళ్లు, కోర్టు కేసులు, వేలం జాబితా, మినహాయింపులపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# ఓటు చోరీపై ప్రశ్నిస్తే లాఠీచార్జ్ చేస్తారా?

**రాహుల్, ప్రియాంకలపై దౌర్జన్యాన్ని ఖండిస్తూ నిరసన**
**మోదీ దిష్టిబొమ్మ దహనం.. కేంద్ర ప్రభుత్వ తీరుపై ఆగ్రహం**
**చేర్యాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్**

కాకతీయ, చేర్యాల: ఓటు చోరీపై ప్రశ్నిస్తున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ వాద్రా, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఇండియా కూటమి ఎంపీలపై జరిగిన దౌర్జన్యాన్ని ఖండిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తామని చేర్యాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మంజె మల్లేశం అన్నారు. ఏఐసీసీ పిలుపు మేరకు వారి ఆధ్వర్యంలో చేర్యాలలో కాంగ్రెస్ శ్రేణులు నిరసన చేపట్టి ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత పవిత్రమైనదని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను కాపాడేందుకు కాంగ్రెస్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఓటు చోరీపై ప్రశ్నలు లేవనెత్తుతున్న ప్రతిపక్ష నాయకులు, ఎంపీలపై లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్య నిరసనలను అణచివేయడమేనని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు, గ్రామశాఖ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# ఆస్పత్రిలో వైద్య సేవలు మెరుగుపడాలి

**పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి**
**రోగులకు వసతులు అందుబాటులోకి తేవాలి**
**పరకాల ఏరియా ఆస్పత్రి సందర్శనలో కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**



కాకతీయ, పరకాల : ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు, అవసరమైన వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. గురువారం నూతనంగా అందుబాటులోకి వచ్చిన ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి జనరల్ మేల్, ఫిమేల్ వార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలు, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు.
ల్యాబ్, గర్భిణుల యాంటీ నాటల్ వార్డు, లేబర్ రూమ్, పోస్ట్ నాటల్ వార్డుతో పాటు మొదటి అంతస్తులోని గదులను పరిశీలించారు. ఫిజియోథెరపీ, బ్లడ్ బ్యాంక్ తదితర విభాగాలకు గదులు కేటాయించాలని, ఆయా విభాగాలను సులభంగా గుర్తించేలా సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసి అవసరమైన వసతులు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. ఆసుపత్రి పక్కనే నిర్మిస్తున్న భవనాన్ని భవిష్యత్ అవసరాలకు వినియోగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఆసుపత్రి ముందు ఖాళీ ప్రదేశంలో మొక్కలు నాటి పచ్చదనం పెంచడంతోపాటు బాక్స్ డ్రైన్ నిర్మించాలని ఆదేశించారు. తనిఖీలో సూపరింటెండెంట్ డాక్టర్ వంశీకృష్ణ, ఆర్ఎంవోలు డాక్టర్ నారాయణరెడ్డి, డాక్టర్ బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్, ఆర్డీవో డీవీస్ వెంకన్న, టీజీఎంఎస్ఐడీసీ ఈఈ నందూ పటేల్, తహసీల్దార్ విజయలక్ష్మి, ఆర్అండ్‌బీ డీఈ లోరిన్ తదితరులు పాల్గొన్నారు.